క్లుప్తంగా

రేపు గెజిట్ నోటిఫికేషన్

కాకినాడ సిటీ: సాధారణ ఎన్నికలలో నామినేషన్ల ప్రక్రియ కోసం సర్వం సిద్ధం చేసినట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18న ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారని, జిల్లాలోని పార్లమెంట్ నియోజకవర్గం, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఆ రోజు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టామన్నారు. సజావుగా నామినేషన్ల ప్రక్రియ జరిగేలా అన్ని ఏర్పాట్లు చేపట్టామన్నారు. నామినేషన్ ప్రక్రియ కోసం నామినేషన్ పేపర్స్ ఇష్యూ కౌంటర్, నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులకు అన్ని అంశాలను కూలంకుశంగా వివరించడం జరుగుతుందని, అభ్యర్థులు నామినేషన్ పత్రం నింపేందుకు ఏర్పాటు చేశామన్నారు. నామినేషన్ ప్రక్రియ కోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కలెక్టర్ నివాస్ తెలిపారు.

సేవా కార్యక్రమాలతో ప్రజా మన్నన పొందాలి



వేళంగిలో గ్రాడ్యుయేట్ యూత్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఉప సర్పంచ్ అయ్యన్న

కరప: వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ సభ్యులు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రజల మన్ననలు పొందాలని ఉప సర్పంచ్ కుంచే అయ్యన్న పేర్కొన్నారు. వేళంగిలో బుధవారం సాయంత్రం వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ కార్యాలయాన్ని ఆయన గ్రామస్తులు చుండ్రు రామతారకం, మేడిశెట్టి పట్టాభితో కల్సి ప్రారంభించి, మాట్లాడారు. గ్రామంలో గ్రాడ్యుయేట్ యూత్ చేస్తున్న సేవాకార్యక్రమాలను ఆయన అభినందించి, ప్రజలకు మరింతగా సేవ చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు జీలకర్ర దుర్గారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'రెడ్డి' కులస్తులు ఐక్యతతో సాగాలి

- జగన్ మళ్లీ సీఎం కావడమే లక్ష్యం
- ప్రతిపక్షాల కుయుక్తులను తిప్పికొడదాం



ప్రసాదరెడ్డి

కాకినాడ: రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి కావడమే లక్ష్యంగా రెడ్డి సామాజికవర్గానికి చెందిన ప్రతినిధులంతా ఐక్యతతో ముందుకు సాగాలని కాకినాడ జిల్లా రెడ్డి జేఏసీ అధ్యక్షుడు ప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కాకినాడలోని తన నివాసంలో జేఏసీ సభ్యుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జేఏసీ అధ్యక్షుడు ప్రసాదరెడ్డి మాట్లాడుతూ త్వరలోనే సీఎం జగన్‌కు మద్దతుగా రెడ్డి వర్గీయులంతా విస్తృత ప్రచారం చేపట్టాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్‌ను రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేక జనసేన, టీడీపీ పక్షాలు కుయుక్తులతో దాడులు చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. దొంగ దెబ్బతీసే వ్యక్తులు, పార్టీల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు.

బీసీవై కాకినాడ ఎంపీ అభ్యర్థిగా అనూష యాదవ్



కాకినాడ సిటీ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాకినాడ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా బీసీవై పార్టీ తరఫున డాక్టర్ అనూష యాదవ్ పేరును పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ బుధవారం ప్రకటించారు. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామానికి చెందిన డాక్టర్ అనూష యాదవ్ ప్రత్తిపాడు నుంచి బీసీవై తరఫున బరిలో దిగేందుకు మొదట రంగం సిద్ధం చేసుకున్నప్పటికీ పార్టీ సమీకరణాల దృష్ట్యా కాకినాడ లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించారు.

అయోధ్య కర సేవకులకు సన్మానం

ఏలేశ్వరం: అయోధ్య కరసేవకు వెళ్లిన వారిని మండలంలోని యర్రవరంలో బుధవారం ఘనంగా సన్మానించారు. బీజేపీ నాయకులు ఉమ్మిడి వెంకట్రావు, కురాకుల రాజా ఆధ్వర్యంలో కర సేవకులు తోట సూర్యాకాంతం, తోట రాఘవరావు, తోట శ్రీనివాసరావు, తోట వెంకటరత్నం, గొల్లవిల్లి బాలులను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ 1992లో అయోధ్యకు యర్రవరం గ్రామానికి చెందిన కరసేవకులు వెళ్లారని తెలిపారు. శ్రీరామనవమి పురస్కరించుకుని వారిని సన్మానించినట్టు చెప్పారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు సర్పంచ్ భీశెట్టి అప్పలరాజు, మైరాల కనకరావు, పోతాబత్తుల పెదబాబు, దొంతంశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



నవమి పూజల్లో పాల్గొన్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి



పాత గైగోలుపాడు రామాలయంలో సీతారాములను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో రాములోరి కల్యాణోత్సవం



కరపలో సీతారాములను దర్శించుకుంటున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌లు

కల్యాణం.. కమనీయం..

- నగరమంతా మార్మోగిన రామనామం
- ఆలయాలు, ఇళ్లలో వైభవంగా నవమి వేడుకలు



మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



సీతారామస్వామి ఆలయంలో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

బోట్‌క్లబ్: సీతారాముని కల్యాణ వేడుకలు చూసేందుకు బుధవారం భక్తులకు రెండు కళ్లు సరిపోలేదు. శ్రీరామ నవమి వేడుకలు నగరంలో రమణీయంగా నిర్వహించారు. పలు సీతారామస్వామి ఆలయాలతో పాటు, పలు దేవస్థానాల్లో కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి దేవస్థానంలో స్వామి దర్శనం కోసం భక్తులు క్యూ కట్టారు. పండితులు వాడపల్లి వెంకటరమణాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈఓ యర్రా వేంకటేశ్వరావు స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తలంబ్రాలు, పానకం, పులిహోర, చిన్నారులకు పెన్నులు పంపిణీ చేశారు. స్థానిక అశోక్‌నగర్‌లో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, జానకిరామ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, విద్యాసాగర్ దంపతులు పాల్గొన్నారు. స్థానిక టూటౌన్ వద్ద నున్న కోదండ రామాలయంలో, రామారావుపేట శివాలయంలో ప్రాంగణంలో రామాలయంలోను, గాంధీనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సీతారాముని ఆలయంలోను కల్యాణ వేడుకలు నిర్వహించారు. స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉన్న రామాలయంలో కనుల పండుగగా కల్యాణం జరిగింది. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త పైడా రామకృష్ణారావు స్వామి వారికి పట్టు వస్త్రాలు అందించారు. భానుగుడి సెంటర్‌లోని రిజర్వ్ పోలీస్‌లైన్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పట్టు వస్త్రాలు సమర్పించారు. విద్యుత్‌నగర్ వినాయకుని ఆలయంలో సీతారామ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. పేర్రాజుపేటలో కె.రామ్‌గోపాల్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవం మాజీ కార్పొరేటర్ నల్లబిల్లి సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్‌వీ సాయిబాబా పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రత్యేక పూజలు

కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి శ్రీరామ నవమి సందర్భంగా పలు ఆలయాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక యాళ్లవారి వీధిలోని, డైరీఫారమ్ సెంటర్‌తో పాటు స్థానిక లక్ష్మీనారాయణ కంపెనీ సమీపంలోని రామాలయంలో ఎమ్మెల్యే నవమి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర విద్యాసాగర్ పాల్గొన్నారు.

రాములవారిని దర్శించిన కన్నబాబు

కాకినాడ రూరల్: శ్రీరామ నవమి వేడుకలు మండలంలో బుధవారం ఘనంగా జరిగాయి. పలు ఆలయాల వద్ద ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేసి ఉత్సవాలను నిర్వహించడంతో పాటు భక్తులకు బెల్లం పానకం పంపిణీ చేశారు. రమణయ్యపేట ఆర్టీసీ కాలనీ, మురళీధర్‌నగర్, గైగోలుపాడు, పండూరు, తిమ్మాపురం, నేమాం, పి.వెంకటాపురం, ఇంద్రపాలెం, చీడిగ, రేపూరు, కొవ్వాడ, గంగనాపల్లి తదితర గ్రామాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాత గైగోలుపాడులో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు.

కరప మండలంలో..

కరప: మండల పరిధిలో చినకొత్తూరు, పల్లపువీధి, కొత్తపేటవీధి, మెరకవీధి తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో సీతారాముల కల్యాణ వేడుకలు నిర్వహించారు. అలాగే మండల గ్రామాల్లోని రామాలయాల్లో భక్తులకు పానకం, వడపప్పు ప్రసాదంగా పంచారు. పలు గ్రామాల్లో అన్నదానం చేశారు. కరపలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, వైస్ ఎంపీపీ పాట్నీడి సత్యభీమేశ్వరరావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, పీఏసీఎస్ చైర్మన్ నక్కా వీరభద్రవవు, వైఎస్సార్ సీపీ నాయకులు కళ్యాణ వేడుకల్లో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రేపటి నుంచి రామలింగేశ్వర కల్యాణోత్సవం

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవం ఈ నెల 19 నుంచి 27 వరకూ వైభవంగా జరుగుతాయని ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి బుధవారం విలేకర్లకు తెలిపారు. ఈ నెల 19న ఉదయం ధ్వజారోహణం, హోమం, బలిహరణ, సాయంత్రం నంది వాహనంపై ఊరేగింపు రాత్రి 9.30కు బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి, భద్రకాళీ సమేత వీరభద్రస్వామి, వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణేశ్వరస్వామికి ఏక కాలంలో దివ్య కల్యాణం, 20న హోమం, బలిహరణ, సాయంత్రం రథోత్సవం, ఆస్థాన పూజ, 21న హోమం, బలిహరణ, రాత్రి సదస్యం, వేద పండిత సత్కారం, 22న ఆస్థాన పూజ, 23న త్రిశూల స్నానం, పూర్ణాహుతి, కంకణ విమోచన, సాయంత్రం ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం తెప్పోత్సవం, 24న బుక్కా సంబరం, 25న శ్రీ పుష్పోత్సవం జరుగుతాయన్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా అమ్మవారు ఈ నెల 19 నుంచి 24 వరకూ బంగారం చీరలో భక్తులకు దర్శనమిస్తారన్నారు.

రేపు విద్యుత్ సరఫరా బంద్

కరప: మండలం నడకుదురు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆ శాఖ కాకినాడ డివిజన్ ఈఈ జి.ప్రసాద్ తెలిపారు. కరపలో బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. నడకుదురు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, 33 కేవీ లైన్‌లో మరమ్మతులు చేస్తున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ తెలిపారు. ఈ కారణంగా నడకుదురు, పెనుగుదురు, గురజనాపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఏఈ సానా ఈశ్వరప్రసాద్ ఈఈ వెంట ఉన్నారు.

మత్స్యకార ప్రాంతాల అభివృద్ధికి కృషి



దుమ్ములపేట ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



భర్త ద్వారంపూడికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తున్న సతీమణి మహాలక్ష్మి

- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- ఎంపీ అభ్యర్థి సునీల్‌తో కలసి ఎన్నికల ప్రచారం

కాకినాడ: మత్స్యకారులు అధికంగా నివసించే దుమ్ములపేట ప్రాంతాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేశానన్న సంతృప్తి ఉందని వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పదో డివిజన్ దుమ్ములపేట శ్రీరామ్‌సెంటర్ నుంచి బుధవారం ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌తో కలసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడచిన ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఎంపీ అభ్యర్థి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ద్వారంపూడి విజ్ఞప్తి చేశారు. విలేకర్లతో ఆయన మాట్లాడుతూ సముద్రవేటను జీవనాధారంగా చేసుకునే మత్స్యకారులకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా నిలిచిందన్నారు. ముఖ్యంగా చిన్నపాటి వర్షానికి, ఆటుపోట్లకు నీటమునిగే దుమ్ములపేట ప్రాంతంలో రహదారులను ఎత్తుచేసి ముంపుబారిన పడకుండా చర్యలు తీసుకున్నానన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలతో పాటు మత్స్యకార భరోసాను అందించామన్నారు. పోర్టు ప్రాంతంలో బ్రిడ్జి నిర్మాణం పూర్తికాగానే మినీ ఫిషింగ్‌హార్బర్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నానన్నారు. కాగా ఎమ్మెల్యే ద్వారంపూడికి దుమ్ములపేట ప్రాంత మత్స్యకారులు హారతులు ఇచ్చి పూలవర్షంతో అపూర్వస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, స్థానిక నాయకులు వాసుపల్లి కృష్ణ, ఎరుపల్లి సీతారామ్, వాసుపల్లి రాంబాబు, పేర్ల దుర్గారావు, ఎరిపల్లి సత్యం, తిరిది జగన్నాథం, వాసుపల్లి అప్పారావు, తిరిది సత్యంతోపాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సతీమణి ప్రచారం

సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సతీమణి మహాలక్ష్మి స్థానిక 5వ డివిజన్‌లో బుధవారం ఎన్నికల ప్రచారం చేశారు. నెర్లిమర్లవారి వీధి, మమత స్కానింగ్‌సెంటర్ ప్రాంతాల్లో ఆమె ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి ద్వారంపూడికి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ కార్పొరేటర్ నల్లబిల్లి సుజాత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మేడిశెట్టి రమణ, శ్రీధర్, అనిల్, మాచారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితర నేతలు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికీ మేలు



పేపకాయలపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కరప: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికీ మేలు చేకూరిందని జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం కరప శివారు పేపకాయలపాలెంలో పార్టీ గ్రామకమిటీ ఆధ్వర్యంలో వారు ఎన్నికల ప్రచారం చేశారు. ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని, గ్రామంలో ఎమ్మెల్యే కన్నబాబు చేసిన అభివృద్ధి పనులను వివరించి, మరింత సంక్షేమం జరగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబును, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. తద్వారా జగన్ సీఎం అవుతారని వారు పేర్కొన్నారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, ఎంపీటీసీ మద్దూరి భవానీ, ఉపసర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, పార్టీనాయకులు పెంకే సత్తిబాబు, రాయుడు శ్రీనివాస్, మద్దూరి సత్యనారాయణ, ఆచంట నాగు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీదే మళ్లీ అధికారం



ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో పార్టీలో చేరిన రమణయ్యపేట ఈశ్వర్‌నగర్‌కు చెందిన బంగారు రాజేష్, ఆయన అనుచరులు

- పార్టీలో చేరుతున్న వారికి ధన్యవాదాలు
- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



ఎమ్మెల్యే కన్నబాబుతో శ్రీకాకుళానికి చెందిన యువకుడు సన్యాసిరావు

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీదే మళ్లీ అధికారమని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద ఈశ్వర్‌నగర్‌కు చెందిన బంగారు రాజేష్, అనుచరులు 150 మందితో జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో బుధవారం రాత్రి చేరారు. రాజేష్, అనుచరులు సోమాదుల ఈశ్వరరావు, మట్టపర్తి చంద్రశేఖర్, సోమాదుల వెంకటరమణ, ధనాల వెంకటలక్ష్మి, కమల, మంగా ఆదిలక్ష్మి, మాడుగుల భవాని, పంపన బుజ్జి, తదితరులకు కన్నబాబు వైఎస్సార్ సీపీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ ప్రభుత్వం ద్వారా పేదలకు ఆర్థిక పరిపుష్టి లభించిందని, పథకాలు కొనసాగాలంటే జగన్ రావలన్నారు. నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నుంచి భారీగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని, వారందరూ పార్టీ విజయం కోసం శ్రమించాలన్నారు. ఎన్నికల్లో తనతో పాటు ఎంపీ అభ్యర్థి సునీల్ విజయం కోసం ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కురసాల సత్యనారాయణ, జంగా గగారిన్, లింగం రవి, గుత్తుల సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కన్నబాబును కలిసిన శ్రీకాకుళం యువకుడు

వైఎస్సార్ సీపీ పట్ల అభిమానంతో మోటారు సైకిల్‌పై ప్రచారం చేస్తూ 175 నియోజకవర్గాల పర్యటనలో భాగంగా ఇక్కడికి వచ్చిన శ్రీకాకుళం జిల్లా యువకుడు గొర్లెల సన్యాసిరావు ఎమ్మెల్యే కన్నబాబును బుధవారం రాత్రి కలిశారు. జగన్‌కు మద్దతుగా 45 రోజులుగా ప్రచారం ప్రారంభించానని, ఇప్పటికి 117 నియోజకవర్గాలు పూర్తయినట్టు ఆయన వివరించారు. ఈ సందర్భంగా సన్యాసిరావును కన్నబాబు అభినందించారు.

సెలవులు సద్వినియోగం చేసుకుందాం

- గ్రంథాలయాల అందుబాటులో 4,280 పుస్తకాల సరఫరా
- వేసవి శిబిరాలకు సన్నద్ధం



గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

బాలాజీచెరువు: గ్రంథాలయాలను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కొత్త పుస్తకాలతో గ్రంథాలయాలకు కొత్త కళ సంతరించుకుంది. మరో వారం రోజుల్లో పాఠశాలలకు వేసవి సెలవులు రానున్నాయి. ఈ నెల 23వ తేదీ పాఠశాలలకు చివరి పనిదినం కాగా 24వ తేదీ నుంచి వేసవి సెలవులు రానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రంథాలయాలకు పుస్తకాలు కనుగోలులో భాగంగా ఉమ్మడి జిల్లాలో గత ఏడాది రూ.1.02 కోట్లతో లక్ష ఆరువేల పుస్తకాలు కనుగోలు చేశారు. వీటిని అన్ని గ్రంథాలయాలకు పంపిణీ చేయగా నగరంలో ఉన్న ప్రధాన గ్రంథాలయంతో పాటు మూడు ఉప గ్రంథాలయాలకు, ఎనిమిది పుస్తక నిక్షిప్త కేంద్రాలకు సరఫరా చేశారు.

ప్రధాన గ్రంథాలయంలో 1800, గాంధీనగర్ బ్రాంచ్‌కు 1820, జగన్నాథపురం 600, ఆనందభారతి గ్రౌండ్ గ్రంథాలయానికి 600 పుస్తకాలు పంపిణీ చేశారు. కొత్తగా వచ్చిన పుస్తకాలు చిన్నారులు, విద్యార్థులను కట్టిపడేస్తున్నాయి. సాయంత్రం సమయంలో చిన్నారులు, పలువురు విద్యార్థుల సమీపంలో ఉండే గ్రంథాలయానికి వచ్చి దాదాపు అరగంట నుంచి గంట సేపు తమకు ఇష్టమైన పుస్తకాలు చదువుతున్నారు. కొత్తగా వచ్చిన పుస్తకాల్లో కథల పుస్తకాలతో పాటు పోటీ పరీక్షల పుస్తకాలు, పాలిటెక్నిక్, ఎంసెట్, లాసెట్, వంటి ప్రవేశ పరీక్షలకు సంబంధించి పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు ఆధ్యాత్మికం, వినోదం పంచే పుస్తకాలు ఉన్నాయి.

అనుమతులు వచ్చిన వెంటనే ప్రారంభిస్తాం



గ్రంథాలయంలో వేసవి సెలవులు సద్వినియెగం చేసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఏటా లాగే ఈ సంవత్సరమూ నిర్వహణకు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ షెడ్యూల్ విడుదల చేస్తుంది. ఇచ్చిన టైమ్ టేబుల్ ప్రకారం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తాం. ప్రతి పాఠశాల నుండి విద్యార్థుల వివరాలు, సెల్ నంబర్లు సేకరించాం. వేసవి శిబిరానికి అనుమతులు వచ్చిన వెంటనే ప్రారంభిస్తాం. – **ములంపాక శ్రీనివాసరావు, గ్రంథాలయాధికారి, గాంధీనగర్**

కూటమి నాయకుల ప్రచారం

కరప: మండలం పెనుగుదురులో బుధవారం జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి ఉమ్మడి కాకినాడ రూరల్ అసెంబ్లీ, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థులు పంతం నానాజీ, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌లను గెలిపించాలని కోరుతూ ఆయా పార్టీల నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. నియోజకవర్గ టీడీపీ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, పంతం సందీప్, పి.శుభామహేష్, బండారు మురళి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

కేసు నమోదు చేసిన ట్రాన్స్‌కో అధికారులు



కారుపై పడిన విద్యుత్ స్తంభం

సామర్లకోట: స్థానిక ప్రసన్నాంజనేయ ఆలయం నుంచి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు వచ్చే రోడ్డులో బుధవారం విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొంది. పెద్దాపురం నుంచి బ్రౌన్‌పేట వైపు వస్తున్న కారు అదుపు తప్పడంతో బడేలమ్మ చెరువు వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. కారుపై విద్యుత్ స్తంభం పడడంతో దానిని తొలగించలేక కారుకు తాళం వేసి అందులోని వారు వెళ్లి పోయినట్టు స్థానికులు తెలిపారు. విద్యుత్‌స్తంభం విరగడంతో స్థానిక సుధా ఆయిల్ ఫ్యాక్టరీకి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడిందని ట్రాన్సుకో అధికారులు తెలిపారు. కారు యజమానిపై కేసు నమోదు చేస్తున్నట్లు ట్రాన్సుకో అధికారులు తెలిపారు.

నేటి నుంచి మాండవ్య నారాయణుని కల్యాణోత్సవాలు



సామర్లకోటలోని మాండవ్యనారాయణస్వామి ఆలయం

సామర్లకోట: స్థానిక భీమవరం తుల్యభాగ నదీ తీరాన కొలువైన శ్రీ, భూ సమేత మాండవ్యనారాయణుని కల్యాణోత్సవాలు గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్టు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పులి నారాయణమూర్తి తెలిపారు. బుధవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఏటా ఉగాది తరువాత వచ్చే ఏకాదశిన స్వామి వారి కల్యాణం జరుగుతుందన్నారు. గురువారం గరుడ వాహన సేవ, శుక్రవారం స్వామి వారికి అమ్మవార్లకు మంగళస్నానాలు, పంచామృతాభిషేకాలు చేస్తున్నట్టు తెలిపారు. సాయంత్రం విఘ్నేశ్వర పూజ, అంకురారోపణ, ధ్వజారోహణ, విష్ణు సహస్రనామ పారాయణ, అనంతరం స్వామి వారి కల్యాణం జరుగుతుందన్నారు. 20వ తేది నుంచి 24వ తేదీ వరకు ప్రత్యేక పూజలు జరుగుతాయని, అదే రోజు రాత్రి స్వామి వారి శ్రీపుష్పయోగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. స్వామి వారి కల్యాణోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.